సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం, కలెక్టర్ రిజ్వాన్ బాషా

సీఎం సభా స్థలం పరిశీలన

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 14 : స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఈ నెల 16న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో శుక్రవారం మండలంలోని శివునిపల్లి శివారులో నిర్వహించే సభా ఏర్పాట్లను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఆర్డీవోలు వెంకన్న, గోపీరామ్, మున్సిపల్ కమిషనర్ రవీందర్ గౌడ్ సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పర్యవేక్షించారు. ముందుగా హెలీప్యాడ్, సభా స్థలికి సంబంధించిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులకు కలెక్టర్, ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్, డీఆర్డీఏ వసంత, డీపీవో స్వరూపారాణి, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ మారపాక రవి

రైతుల సమస్యలు తీర్చాకే సీఎం అడుగు పెట్టాలి

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 14 : సాగునీరు లేక తనువులు చాలిస్తున్న రైతుల సమస్యలు తీర్చాకే సీఎం రేవంత్‌రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్ గడ్డపై అడుగు పెట్టాలని, లేదంటే సీఎం సభను మాజీ ఎమ్మెల్యే రాజయ్య నేతృత్వంలో అడ్డుకుంటామని మాజీ జడ్పిటీసీ మారపాక రవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రాజెక్టుల్లో నీరు ఉన్నా రైతులకు సాగునీరు అందించకపోవడంతో పంటలు ఎండి అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రైతుల సమస్యలు తీర్చాకే ఈ నియోజకవర్గ గడ్డపై సీఎం అడుగు పెట్టాలని, లేదంటే రైతులు తరిమి కొడతారని హెచ్చరించారు. పదేళ్లుగా రైతులు ఎలాంటి సమస్యలు లేకుండా రాజులా బతికి నేడు ఎరువులు, పురుగు మందుల కోసం చెప్పులను లైన్లో పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఈ స్థితికి కారణమైన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం రైతుల పాలిట ద్రోహులుగా మిగిలారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు మృతి చెందిన వారం రోజుల్లో రైతు బీమా అందించి ఆదుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రైతు బీమా చెల్లించకుండా వారి కుటుంబాలను బజారున పడేస్తున్నారని ఆరోపించారు. రైతు బంధును రైతు భరోసాగా మార్చి వాటిని చెల్లించకుండా సుమారు 420 మంది రైతుల ఆత్మహత్యలకు సీఎం కారణమయ్యారన్నారు. పార్టీ మారిన వారిని రాళ్లతో కొట్టాలని చిలుక పలుకులు పలికిన సీఎం.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కడియం శ్రీహరిని ఏం చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సురేశ్‌కుమార్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కనకం గణేశ్, మండల యూత్ అధ్యక్షుడు గుండే మల్లేశ్, దళిత నాయకులు గుర్రం చిట్టిబాబు, గాదే రాజు పాల్గొన్నారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ పోలీసు అధికారులతో కలిసి వేడుకలో పాల్గొని నృత్యం చేశారు

బచ్చన్నపేట : హోలీ జరుపుకుంటున్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు

దేవరుప్పుల : హోలీ సంబురాలు చేసుకుంటున్న పిల్లలు

నర్మెట : వెల్దండ గ్రామంలో..

ఘనంగా హోలీ వేడుకలు

- ఊరూరా రంగుల పండుగ
- కలర్స్ పూసుకొని వేడుక జరుపుకున్న ప్రజలు, అధికారులు
- చిన్నాపెద్దా తేడా లేకుండా సంబురాలు
- ఎటుచూసినా 'కలర్'ఫుల్ జోష్

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్, మార్చి 14 : హోలీ పండుగతో జనం కేరింతలు కొట్టారు. శుక్రవారం జనగామ జిల్లాలో హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా, నెహ్రూపార్కు, కుర్మవాడ, పాత బీటు బజార్, స్టేషన్ రోడ్డు, రెడ్డి స్ట్రీట్, గణేశ్‌వాడ, గుండ్లగడ్డ, ధర్మకంచ, వీవర్స్ కాలనీ, గిర్నిగడ్డ, గోకుల్ నగర్, జ్యోతి నగర్, బాలాజీ నగర్, శ్రీనివాస నగర్ కాలనీ, బతుకమ్మకుంట, ప్రగతి నగర్, సంజయ్ నగర్, అంబేద్కర్ నగర్, శ్రీరాం నగర్, రాజీవ్ నగర్ ఏరియాల్లో ప్రజలు ఉత్సాహంగా రంగులు చల్లుకొని ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. బతుకమ్మకుంటలో వాకర్స్ అసోసియేషన్, ఆర్టీసీ చౌరస్తాలో హిందూ వాహిని ఆధ్వర్యంలో హోలీ సంబురాలు చేసుకున్నారు. అదేవిధంగా కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి రంగులు పూసారు. జిల్లా అధికారులు, ఉద్యోగులందరితో కలిసి కలెక్టర్ హోలీ వేడుకల్లో పాల్గొని నృత్యం చేశారు. బచ్చన్నపేటలో ఆర్యవైశ్య సంఘం మాహాసభ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు కొత్తపల్లి రాజయ్య తదితరులు పాల్గొన్నారు. నర్మెటలో ప్రజలతోపాటు సీఐ అబ్బయ్య, ఎస్సై నగేశ్ హోలీ వేడుకలో పాల్గొన్నారు. పాలకుర్తి మండలంలోని ప్రజలు, అధికారులు సంతోషంతో రంగులు పూసుకుని హోలీ ఆడారు. పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎస్సైలు దూలం పవన్‌కుమార్, మేకల లింగారెడ్డి, యాకూబ్ హూస్సేన్, కాంట్రాక్టర్ వర్రె వెంకన్న, ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలు జక్కుల రవీందర్, వీరమనేని వెంకటేశ్వర్‌రావు, రాపాక విజయ్, వర్తక సంఘం ఆధ్వర్యంలో చారగొండ్ల ప్రసాద్, తమ్మి రాంబాబు, మనం మనం షటిల్ గ్రూప్ ఆధ్వర్యంలో తాళ్లపెల్లి చంద్రశేఖర్, డీవీఆర్ శర్మ హోలీ వేడుకలను జరుపుకున్నారు. జఫర్‌గఢ్‌లోని గాంధీ సెంటర్, ఆర్యవైశ్య భవన్‌లో వేడుకలు ఘనంగా జరిగాయి. రఘునాథపల్లి మండలం, దేవరుప్పుల మండలం, స్టేషన్‌ఘన్‌పూర్‌తోపాటు శివునిపల్లిలో యువత, చిన్నా, పెద్దా రంగులు చల్లుకుంటూ కనిపించారు.

జనగామ చౌరస్తా : క్యాంపు కార్యాలయంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్ : శివునిపల్లిలో హోలీ ఆడుతున్న యువత

పాలకుర్తి : సీఐ గట్ల మహేందర్‌రెడ్డితో హోలీ ఆడుతున్న జర్నలిస్టులు

జనగామ రూరల్ : సిద్దెంకిలో హోలీ వేడుకలో పాల్గొన్న మహిళలు, పిల్లలు

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

జఫర్‌గఢ్, మార్చి 14 : మద్యం మత్తులో ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తమ్మడపల్లి(జి)లో జరిగింది. ఏఎస్సై వెంకటనారాయణ కథనం ప్రకారం.. తమ్మడపల్లి(జి) కి చెందికి చెందిన గాదె యాదగిరి(42) కారు డ్రైవర్ గా జీవించేవాడు. 20 ఏళ్ల క్రితం యాదగిరికి వివాహం చేయగా ఇద్దరు పిల్లలు పుట్టారు. ఈ క్రమంలో అనారోగ్యంతో భార్య చనిపోగా యాదగిరి రెండో వివాహం చేసుకోగా ఒక కూతురు పుట్టింది. తాగుడుకు అలవాటు పడిన యాదగిరి భార్యతో గొడవ పడగా 8 నెలల క్రితం కూతురుతో పుట్టింటికి వెళ్లింది. ఇటీవల గ్రామంలోని కొంత భూమి అమ్మగా డబ్బులు రావడంతో యాదగిరి ఈ నెల 13న అతిగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో రాత్రి ఇంటి దగ్గరలో ఉన్న మర్రి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడి తండ్రి గాదె పోశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్ట్‌మార్టం నిమిత్త మృతదేహాన్ని దవాఖానకు తరలించినట్లు ఏఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో మరొకరు..

హసన్‌పర్తి, మార్చి 14 : అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. సీఐ చేరాలు కథనం ప్రకారం.. మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన కల్లెబోయిన మల్లయ్య(50) ఆరు నెలల క్రితం అప్పు చేసి ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. అది సరిగ్గా నడవక పోవడంతో అప్పులు పెరిగిపోయాయి. వాటిని ఎలా కట్టాలో తెలియక మానసికంగా కుంగిపోయాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో గడ్డి మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు 108కి సమాచారం ఇవ్వగా, ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ

రఘునాథపల్లి మార్చి 14: లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి స్టేషన్ జోనల్ చైర్మన్ కూరెల్లి ఉపేందర్ మనవరాలు జశ్విత జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్థానిక క్లబ్ అధ్యక్షుడు కందుల అనిల్ కుమార్ హాజరై బస్టాండ్ ఆవరణలో పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూరెల్లి వేద కుమార్, కూరెల్లి వినయ్ కుమార్, క్లబ్ పూర్వ అధ్యక్షుడు పండి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా రావడం సిగ్గుచేటు

రఘునాథపల్లి మార్చి 14 : ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీలతో పాటు సంక్షేమ పథకాలు ప్రజలకు అందించలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి రావడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి ఎర్రోళ్ల కుమార్‌గౌడ్, మండల కోఆర్డినేటర్ ముసిపట్ల విజయ్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ గుర్తుతో గెలిచి, అధికార దాహంతో బిడ్డ భవిష్యత్ కోసం పార్టీ మారిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రజాక్షేత్రంలోకి రావాలంటే భయపడుతున్నారన్నారు. రాష్ట్రంలో నిధుల కొరత ఉందని సీఎం స్వయంగా చెబుతుంటే కడియం శ్రీహరి మాత్రం నియోజకవర్గం అభివృద్ధికి రూ.800 కోట్లు మంజూరయ్యాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు అయినా తట్టెడు మట్టి కూడా పోయని శ్రీహరి రూ.800 కోట్లు తెచ్చానని చెప్పడం ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టేలా ఉందని ఎద్దేవా చేశారు. రైతు భరోసా ఇప్పటికీ కొంత మందికి వేయలేదని, రూ.2లక్షల రుణ మాఫీ జరుగలేదని యాసంగి సాగుకు నీరు అందక రైతుల పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ఏ ముఖం పెట్టుకొని సీఎం స్టేసన్‌ఘపూర్ వస్తున్నారని, ప్రజల చేతిలో దెబ్బలు తినక తప్పదని హెచ్చరించారు. త్వరలోనే ఉప ఎన్నిక రావడం ఖాయమని మళ్లీ స్టేషన్ ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ గెలుపు తథ్యమని జోష్యం చెప్పారు. అసెంబ్లీలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి రైతుల పక్షాన నిలబడి మాట్లాడినందుకు సస్పెండ్ చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో జిల్లా యువజన నాయకులు లోకుంట్ల సృజన్, కొమురవెల్లి దేవాలయ మాజీ డైరెక్టర్ కావటి రాజయ్య, యూత్ అధ్యక్షుడు దుబ్బాక హరీశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ముక్క పరశురాములు, జిల్లా నాయకులు కొర్ర రాజేందర్, గుండె జోసఫ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ గాదె కుమార్, యామాంకి కృష్ణ, నరేందర్‌రెడ్డి, తిప్పారపు బాబు రావు, మాచర్ల శ్రీనివాస్, ఎడ్ల బాలరాజు, మద్దూరి సురేశ్, ఇమ్మడిశెట్టి రఘురాం, ఎండీ రంజాన్, మార్కల మహేందర్, దుబ్బాక నర్సింహులు, ముప్పుడి యాదగిరి, చాట్ల ఆంజనేయులు, వల్లెపు యాదగిరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విజయ్, కుమార్‌గౌడ్

కండరాల వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలి

బచ్చన్నపేట, మార్చి 14 : రాష్ట్రంలో కండరాల వ్యాధితో బాధపడుతున్న 4 వేల మందిపై ప్రభుత్వం కనికరం చూపడం లేదని సీపీఎం జిల్లా నాయకుడు గొల్లపల్లి బాపురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కండరాల క్షీణత వ్యాధితో బాధపడుతున్న వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తన కుమారుడు పుట్టుకతో బాగానే ఉన్నప్పటికీ 8 ఏళ్లు దాటగానే అరుదైన మస్కులర్ డిస్ట్రోఫీ (కండరాల క్షీణత) వ్యాధి సోకిందని తెలిపారు. రాష్ట్రంలోని పెద్ద పెద్ద దవాఖానలు తిరిగి రూ.లక్షలు ఖర్చు చేశామన్నారు. అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఈ వ్యాధికి మందులు లేవని, భార్యాభర్తలం ఇద్దరం కుమారుడికి సపర్యలు చేస్తూ ఆరేళ్లుగా చదివిస్తున్నామని తెలిపారు. తనంతట తాను కాలేజీకి వెళ్లేందుకు బ్యాటరీ వీల్‌చైర్ కావాలని గతంలో కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేర్‌టేకర్ ఉంటే తప్ప జీవనం సాగించడం కష్టతరమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇలాంటి వ్యాధిగ్రస్తులకు ఒక కేర్ టేకర్ ఏర్పాటు చేసి, నెలకు రూ.15 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు.

కండరాల వ్యాధితో బాధపడుతున్న కుమారుడితో తండ్రి బాపురెడ్డి

తండ్రిని కాపాడబోయి కుమారుడు మృతి

పండుగ పూట జనగామలో విషాదం

జనగామ చౌరస్తా, మార్చి 14 : హోలీ పండుగ పూట జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తండ్రిని కాపాడబోయి ఓ పుత్రుడు ప్రాణాలు కోల్పోయిన హృదయ విదారకర ఘటన జనగామలో జరిగింది. కరెంట్ షాక్ తగిలిన తండ్రిని కాపాడబోయి కుమారుడు కనిష్క వర్ధన్ వర్మ (12) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. బచ్చన్నపేటకు చెందిన సందెల వెంకటేశ్వర్లు-స్వప్న దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేశ్వర్లు జనగామ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తూ స్థానిక కుర్మవాడ ఏరియాలో కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. సిద్దిపేట రోడ్డులోని బ్రాహ్మణవాడ (శామీర్‌పేట)లో కొత్తగా ఇళ్లు నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం హోలీ పండుగ సందర్భంగా సెలవు కావడంతో కొత్త ఇంటికి నీళ్లు పట్టడానికి తన ఇద్దరు కుమారులను తీసుకొని వెళ్లాడు. మోటర్ ఆన్ చేసి నీళ్లు పట్టే సమయంలో ప్రమాదవశాత్తు వెంకటేశ్వర్లు కరెంట్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. గమనించిన పెద్ద కుమారుడు కనిష్క వర్ధన్ వర్మ కర్ర సాయంతో తండ్రిని కాపాడబోయే ప్రయత్నంలో తాను కూడా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. ప్రమాదం స్థలంలో పక్కనే ఉన్న చిన్న కుమారుడు గట్టిగా అరవడంతో స్థానికులు వచ్చి కర్రతో విద్యుత్ వైర్లను పక్కకు తొలగించారు. అపస్మారక స్థితిలో పడి ఉన్న తండ్రీ, కొడుకులను చికిత్సనిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. వెంకటేశ్వర్లు ప్రాణాలతో బయటపడగా, పెద్ద కుమారుడు కనిష్క వర్ధన్ వర్మ మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం బాలుడి మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామం బచ్చన్నపేటకు తరలించారు. కనిష్క వర్ధన్ వర్మ ప్రస్తుతం జనగామలోని నెహ్రూ పార్కు సెయింట్ పాల్స్ హైస్కూల్లో 6వ తరగతి చదువుతున్నాడు. అతడు చదువులో మంచి ప్రతిభగల విద్యార్థి అని పాఠశాల ప్రిన్సిపాల్ మరియ జోసెఫ్ తెలిపారు. తండ్రిని కాపాడబోయి ప్రాణాలు విడిచిన బాలుడి ధైర్య సాహసాలను ప్రభుత్వం గుర్తించి, అతడికి శౌర్య పురస్కారాన్ని ఇవ్వాలని స్థానికులు విన్నవించారు.

కనిష్క వర్ధన్ వర్మ(ఫైల్)

శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

ఆర్యవైశ్య మహసభ మండల అధ్యక్షుడిగా దామెర శ్రీనివాస్

స్టేషన్ ఘన్‌పూర్, మార్చి 14 : ఆర్యవైశ్య మహాసభ కొడకండ్ల మండల మండల అధ్యక్షుడిగా దామెర శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, డాక్టర్ మాధంశెట్టి వరూధిని తెలిపారు. శుక్రవారం ఎన్నికలు నిర్వహించగా దామెర శ్రీనివాస్ ఒక్కరే నామినేషన్ వేసినట్లు పేర్కొన్నారు. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షకులుగా గన్ను నరసింహులు, బెజ్జం భిక్షపతి, గంగిశెట్టి అనూజ, పడకండి రవీందర్, జిల్లా రాములు, సంతోష్, గజ్జి సంతోష్, ఈరెంటి సాయికృష్ణ, నంగునూరి రవీందర్, ఆరూరి జయప్రకాశ్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

సాగునీరు లేక ఎండుతున్న పంటలు

- అడుగంటిన భూగర్భ జలాలు
- చుక్కనీరు పోయని బోర్లు
- పశువులు, ముగజీవాలకు మేతగా వరిపాలాలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

జనగామ రూరల్, మార్చి 14 : ఏ గ్రామంలో చూసినా ఎండిన పంటలు దర్శనమిస్తున్నాయి. సాగునీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం మీద ఆశలతో కాల్వల ద్వారా నీళ్లు వస్తాయని రైతులు వరిసాగు చేస్తే తీరా చుక్క నీరు రాకుండా పోయింది. తొలుత బార్లు, బావుల ద్వారా నాట్లు వేసిన ఆ తర్వాత పొట్టదశ, మరికొంత మంది రైతుల పంట ఈనిన దశలో నీళ్లులేక తడారిపోయింది. చేసేదేమి లేక రైతులు దాన్ని పశువులు, జీవాలకు మేతగా వదిలిపెట్టారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి పెడితే చేతిలో మిగిలిందేమీ లేదని అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. జనగామ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామాలకు గోదావరి కాలువలు ఉన్నా చుక్కనీరు రాకపోవడంతో ఈ సమస్య వచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడుతున్నారు. పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా మళ్లీ కరువు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు ఎండిపోయి, కుంటలు వట్టిపోయి భూగర్భ జలాలు పాతాలానికి పడిపోయాయని చెబుతున్నారు.

వడ్లకొండలో పొట్టకొచ్చిన వరి పంట ఎండిపోగా, మేస్తున్న మూగజీవాలు, (ఇన్‌సెట్‌లో) నీరులేక ఇంటివద్ద తొట్లలోని నీరు తాగుతున్న జీవాలు

గొర్రెలు తాగేందుకూ నీళ్లు లేవ్

నేను పది ఎకరాలు నాటు వేసిన. నాటేసేటప్పుడు నీళ్లు మంచిగానే ఉన్నాయి. పంట పండుతది అని అనుకున్నా.. కానీ, వచ్చిరాని కరంట్‌తో బోరు పోయకపోవడంతో నాటు వేసిన పంట అంత ఎండిపోయింది. పొట్టదశలో కొంత, మరికొంత పంట ఈనినంక ఎండిపోయింది. మాకు గొర్లు ఉన్నాయి. వాటికి కూడా నీళ్లు లేకుంటే ఇంటి కాడనే తొట్లు పెట్టి మిషన్ భగీరథ(కేసీఆర్ నల్లా)తో వాటి దూ ప తీరుస్తున్నాం. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పంట ఏసినం. ఈ మధ్యనే ఓ బోరు కూడా వేసినం. అదికూడా పడలే. ఇప్పటి వరకు అప్పులే మిగిలినయి. పంట మూగజీవాలకు మేతగా మారింది. గతంలో ఎన్నడు ఇట్ల పంట ఎండిపోలే. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు మస్తు నీళ్లు వచ్చేవి. గీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కరువు కూడా వచ్చింది. మేమేట్ల బతకాలే..? మా పిల్లలు ఏట్లా బతుకాలే? ఇప్పుడు ఆధారం ఏమిలేదు. గప్పుడు కేసీఆర్ ఇచ్చిన జీవాలతోనే బతుకుతున్నాం. పిల్లలు బయట పనులకు పోతుండ్రు. నేను మా ముసలాయన జీవలకాడికి వస్తున్నాం.

– గుత్తి భాగ్యమ్మ, వడ్లకొండ, జనగామ మండలం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కమర్షియల్ స్పేస్‌లు అమ్మకం

★ హనుమకొండలో కిరాయిలు వచ్చు 1650, 2500, 6000 Sft. కమర్షియల్ స్పేస్‌లు తక్కువకు అమ్మకానికి కలవు. వెంటనే సంప్ర: సెల్: 9348199922.

NTW-332339

WANTED TEACHERS

★ WANTED TEACHERS For High School Section with B. Ed., & For Primary Section with Graduation. Send your Resume Whatsapp:9949033066/9989429744.

NTW-482

PLOT FOR SALE

★ జనగామ కలెక్టరేట్‌కు & కొత్త విమానాశ్రయం, Textile Parkకు అతి చేరువలో DTCP/RERA approved Layoutతో గజం కేవలం 5,499/-కి పొందండి with all Developmenting. Contact: 7780324073.

NT-330714

PLOT FOR SALE

★ హైదరాబాద్‌లో నూతన నగరం ఫ్యూచర్ సిటీ శ్రీశైలం హైవే మహేశ్వరంలో ఓపెన్ ప్లాట్స్ కలవు. 100 చ.గజాలు 6 లక్షలు మాత్రమే... మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు... 100% రిటర్న్స్... EMI కలదు. Cont: 8008091512.

NT-330716

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565